## వైభవంగా దీపోత్సవం



దీపాలను వెలిగిస్తున్న భక్తులు

బాసర, డిసెంబర్ 24 : బాసర సరస్వతీ అమ్మవారి ఆలయంలో మంగళవారం 40వ లక్ష దిపోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. మెదక్ జిల్లాలోని ఆత్మానంద్ ఆశ్రమ స్వామిజీ శ్రీశ్రీశ్రీ పూజ్యపాద రాజ యోగి వెంకటస్వామిజీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం సాయంత్రం 6 గంటల సమయంలో ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించి దీపోత్సవాన్ని ప్రారంభించారు. ఈ దీపోత్సవంలో భక్తులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని దీపాలను వెలిగించి విజయవంతంగా నిర్వహించారు.

## సీసీఎల్ మంజూరు చేయాలని డీఈవోకు వినతి



డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి

ఎదులాపురం, డిసెంబర్ 24 : సమగ్ర కుటుంబ సర్వేలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సీసీఎల్ మంజూరు చేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణ కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి తిరుతోపు నరసింహ స్వామి, తపస్ ఆదిలాబాద్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సునీల్ హన్, వలభోజు గోపి కృష్ణ, బందూకుల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం డీఈవో ప్రణీతకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా సాధారణ సెలవుల్లో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులు వారి సెలవులను కోల్పోవడం జరిగిందన్నారు. కోల్పోయిన సెలవుల స్థానంలో వారికి కంపెన్సేటరీ క్యాజువల్ సెలవు సీసీఎల్ మంజూరు చేయాలని కోరారు.



గాదిగూడ విద్యార్థుల సామర్థ్యాన్ని పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా
- ఝరి, గాదిగూడ ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎంలకు షోకాజ్ నోటీసులు
- ఝరి వార్డెన్‌కీ కూడా.. ● గాదిగూడ ఏఎన్‌ఎం విధుల నుంచి తొలిగింపు

నార్నూర్, డిసెంబర్ 24 : గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. గాదిగూడ మండలంలోని ఝరి, గాదిగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత బాలుర పాఠశాలలను ఆకస్మికంగా మంగళవారం సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు పట్టికతోపాటు గిడ్డంగిలో స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నిత్యం వంట, స్టోర్ గది, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచేలా చూడాలన్నారు. అనంతరం విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఝరి వార్డెన్ రాంకిషన్‌ను వేరే స్థలానికి మార్చామన్నారు. గాదిగూడ, ఝరి ప్రధానోపాధ్యాయులకు షోకాస్ నోటీసులను జారీ చేశారు. గాదిగూడ ఏఎన్‌ఎంను విధుల నుంచి తొలగించారు.

# రైతు భరోసా ఎగ్గొటేందుకు కుట్ర

**పీఎం కిసాన్ సమ్మాన్ రైతులకే భరోసా సాయం ఇచ్చే అవకాశం**

- ఉమ్మడి జిల్లాలో 6.19 లక్షల నుంచి 2.74 లక్షలకు తగ్గనున్న లబ్ధిదారులు
- 3.44 లక్షల మంది రైతులకు భరోసా లేనట్లే..



మంచిర్యాల, డిసెంబర్ 24(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కేసీఆర్ సర్కారు రైతుబంధు రూపంలో ఇచ్చిన పంట పెట్టుబడి సాయాన్ని రైతు భరోసా పేరిట ఇస్తామంటూ ఎన్నికల ముందు చెప్పిన కాంగ్రెస్.. అధికారంలోకి వచ్చి యేడాదైనా ఆ ఊసెత్తడం లేదు. ఎకరానికి రూ.15 వేల చొప్పున ఇస్తామంటే పెట్టుబడి సాయం పెరుగుతుందని రైతులు ఆశపడ్డారు. కానీ.. ఇచ్చే మొత్తం పెంచినట్టే పెంచి నిబంధనల పేరిట సగానికి కంటే ఎక్కువ మంది రైతులకు రైతు భరోసా ఎగ్గొట్టేందుకు కుట్ర చేస్తుందని రాజకీయ, వ్యవసాయ రంగ నిపుణులు చెప్తున్నారు. అసెంబ్లీ సమావేశాలు నిరవదిక వాయిదా పడే రోజు స్వల్పకాలిక చర్చ పెట్టి విధివిధానాలు ఏంటో చెప్పకుండానే ముగిం చేశారు. కాకపోతే ఈ చర్చలో కేంద్ర ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయంగా అమలు చేస్తున్న పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలను అసెంబ్లీలో పెట్టారు. దీంతో పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కింద లబ్ధిపొందున్న రైతులకు మాత్రమే రైతు భరోసా వస్తుందనే చర్చ ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. అదే జరిగితే రాష్ట్రంలో 40 లక్షల మంది రైతులు, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 3.44 లక్షల మంది రైతులు రైతు భరోసాకు దూరమవుతారని ప్రస్తుత గణాంకాలు చెప్తున్నాయి

### నిబంధనల పేరిట కోత

నిబంధనల పేరిట రుణమాఫీ ఇవ్వకుండా రైతులకు మొండిచేయి చూపించారో.. అదే తరహాలో రైతు భరోసా పథకాన్ని కొందరికీ వర్తింప చేస్తారని సమాచారం. పీఎం కిసాన్ సమ్మాన్ నిధి నిబంధనలే రైతు భరోసాకు వర్తింప చేస్తే దాదాపు గతంలో 70 లక్షల మందికి ఇచ్చిన రైతుబంధు 30 లక్షల మందికి ఇస్తే సరిపోతుంది. ప్రతి సీజన్‌కు అప్పుడు రూ.15 వేల కోట్లు ఖర్చుపెడితే ఇప్పుడు కేవలం సీజన్‌కు 5 వేల కోట్ల లోపు ఇస్తే సరిపోతుదని భావిస్తున్నది. ఈ విషయాన్ని నేరుగా చెప్పలేక సీఎం రేవంత్‌రెడ్డి గుట్టలు, బండరాళ్లు, రోడ్లకు రైతుబంధు ఇచ్చారంటూ ముందే కవర్ చేసుకున్నారని.. తాము చేసే మోసాన్ని కప్పిపుచ్చి ప్రతిపక్షంపై విమర్శలతో సరిపెట్టారని విశ్లేషకులు చెప్తున్నారు. ఈ లెక్కన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 6.19 లక్షల మందికి రావాల్సిన పెట్టుబడి సాయం 2.74 లక్షల మందికి మాత్రమే వస్తుందని అంచనా వేస్తున్నారు. పీఎం కిసాన్ నిబంధనలు అమలు చేస్తే ఇంట్లో ఒక్క రైతుకు మాత్రమే పెట్టుబడి సాయం వస్తుంది. ఇంట్లో ఇద్దరి ముగ్గురి పేరుపై భూమి ఉంటే అందులో ఒక్కరికే రైతు భరోసా ఇస్తారు. రుణమాఫీ మాదిరిగానే కనీసం రెండేండ్లు ఐటీ కట్టిన వారికి రైతు భరోసా రాదు. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, డాక్టర్లు, ఇంజినీర్లు, లాయర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, ఆర్కిటెక్ట్స్, ఇతర ప్రొఫెషనల్స్‌లో ఉన్నవారెవరికీ రైతు భరోసా రాకుండా పోతుంది.

### యాసంగి పంట వేయ నోళ్లకు కోతే..

వానకాలంలో సాగు చేసి యాసంగిలో సాగు చేయని భూములకు రైతు భరోసా ఇవ్వరనే చర్చ వినిపిస్తున్నది. ఎందుకంటే వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఇటీవల శాసనసభలో అందించిన వివరాల్లో యాసంగిలో సాగు చేయని భూములను సాగులో లేని భూముల కింద చూపించారు. ఇదే జరిగితే రైతు భరోసాకు అర్హులయ్యే రైతులు సంఖ్య ప్రస్తుతం ఉన్న దానిలో 30 శాతానికి పడిపోయినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని నిపుణులు అంటున్నారు. అరకొర రుణమాఫీ చేసి అర్హులైన వారికి ఎందుకు రాలేదంటే చేతులు ఎత్తేసిన కాంగ్రెసోళ్లు.. రైతు భరోసా పేరిట మరోసారి మోసం చేసేందుకు వస్తున్నారని రైతులు, రైతు సంఘాల నాయకులు మండిపడుతున్నారు. కేసీఆర్ సర్కార్‌లో ఉమ్మడి జిల్లాలో 6.19 లక్షల మంది రైతులకు ప్రతి సీజన్‌లో రూ.880.34 కోట్లు ఇచ్చింది. అదే తరహాలో కాంగ్రెస్ ప్రభుత్వం అందరికీ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

### అందరికీ రైతు భరోసా ఇవ్వాలి..



రుణమాఫీ అని చెప్పి కొందరు రైతులకు చేయనేలేదు. ఎందుకు చేయలేదంటే సాంకేతిక కారణాలు అంటున్నారు. ఇప్పటికీ అన్ని రకాలుగా అర్హులైన రైతులకు మాఫీ అవుతుందో లేదో స్పష్టత లేదు. ఇలాంటి పరిస్థితుల్లో రైతు భరోసా కూడా కొందరికే వస్తుందని వార్త కథనాలు వస్తున్నాయి. నాకు తెలిసి రైతుల్లో సగం మందికి పీఎం కిసాన్ కింద డబ్బులు వస్తలేవు. కానీ రైతు బంధు వచ్చింది. ఇప్పుడు వారందరికీ రైతు భరోసా కూడా ఇవ్వమనడం సరికాదు. రైతుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం పునరాలోచించాలి. కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఇచ్చినట్లే రైతులందరికీ రైతు భరోసా అందేలా చూడాలి.

*- అర్నె సమ్మయ్య పటేల్, చెన్నూర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్.*

**జిల్లాలో రైతుబంధు, పీఎం కిసాన్ లబ్ధిదారుల వివరాలు..**

| జిల్లా | రైతుబంధు పొందిన రైతులు(లక్షల్లో) | పీఎం కిసాన్ పొందిన రైతులు |
|---|---|---|
| ఆసిఫాబాద్ | 1.31 | 34,827 |
| ఆదిలాబాద్ | 1.46 | 95,138 |
| నిర్మల్ | 1.89 | 88,000 |
| మంచిర్యాల | 1.53 | 56,065 |
| మొత్తం | 6.19 | 2,74,030 |



సర్వే తీరును పరిశీలిస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాజర్షి షా

## సర్వేను పరిశీలించిన కలెక్టర్

తలమడుగు, డిసెంబర్ 24 ః డోర్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల మొబైల్ యాప్ సర్వే తీరును మంగళవారం కలెక్టర్ రాజర్షి షా పరిశీలించారు. మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పర్యటించి ఇందిరమ్మ ఇండ్ల సర్వే పని తీరును తెలుసుకున్నారు. అనంతరం డోర్లి గ్రామంలో జరుగుతున్న సర్వేను నిశితంగా పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్ల సర్వే యాప్‌లో అర్హులైన వారందరినీ నమోదు చేసే విధంగా చూడాలని, ఎక్కడ కూడా తప్పులు లేకుండా సర్వేను కొనసాగించాలని కోరారు. సర్వేకు ముందుగానే ప్రజలకు తెలియజేసి అవసరమైన డాక్యుమెంట్స్‌ను తమ వద్ద ఉంచుకోవాలని కోరారు. కాగా.. సర్వే యాప్ కొంత మేర సరిగ్గా పని చేయడం లేదని, దాని వల్ల సర్వే ముందుకు వెళ్లడం లేదని సిబ్బంది కలెక్టర్‌కు వివరించారు. దీంతో సమస్యలను నివృత్తి చేశారు. అలాగే సాధ్యమైనంత తొందరగా సర్వేను వేగవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్ మోహన్, ఎంపీడీవో శేఖర్, పంచాయతీ కార్యదర్శి గజానాన్, సర్వేయర్ అపర్ణ, ఇందిరమ్మ, ఇండ్ల కమిటీ సభ్యులు అసం రవి, రావుల నారాయణ పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట రోడ్లను ఊడుస్తూ నిరసన తెలుపుతున్న ఎస్‌ఎస్‌ఏ ఉద్యోగులు

## రోడ్లను ఊడ్చి..

'రోడ్లను ఊడుస్తున్నాం.. సీఎం సారూ.. మా సమస్యలను పరిష్కరించండి..' అంటూ ఎస్ఎస్ఏ ఉద్యోగులు వినూత్నంగా నిరసన తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు చేస్తున్న సమ్మె మంగళ వారం నాటికి 15వ రోజుకు చేరుకున్నది. ఇందులో భాగంగా రోడ్లను ఊడుస్తూ నిరసన తెలిపారు. ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలతో హోరెత్తించారు. - ఎదులాపురం, డిసెంబర్ 24

## సేంద్రియ ఆహార పదార్థాలు ఆరోగ్యకరం

**- నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

సోన్, డిసెంబర్ 24 : సేంద్రియ ఉత్పత్తుల ఆహార పదార్థాలు తీసుకోవడం వల్ల ఆరోగ్యకరమైన జీవితం పొందవచ్చని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో సేంద్రియ పదార్థాల ఆహార కేంద్రాన్ని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సేంద్రియ ఆహార పదార్థాలను తీసుకోవడం వల్ల రోగ నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో విజయలక్ష్మి, డీఎస్‌వో కిరణ్‌కుమార్, డీఏవో అంజిప్రసాద్, జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ రాంగోపాల్ పాల్గొన్నారు.

### నుమాయిష్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జనవరి 5 నుంచి 7వ తేదీ వరకు మూడు రోజులపాటు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు పట్టణంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో నుమాయిష్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో నుమాయిష్ ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ శాఖల ఆధ్వర్యంలో హస్తకళలు, పెయింటింగ్స్, చేతివృత్తులు, వ్యవసాయ ఉత్పత్తులు, మహిళా స్వయం సంఘాల ఉత్పత్తులు, పుస్తకాల స్టాల్‌లను ఏర్పాటు చేయాలని తెలిపారు. ఔత్సాహికులైన ప్రజల నుంచి కూడా తమ పేర్లను నమోదు చేయడం ద్వారా వారి వారి ఉత్పత్తుల స్టాళ్లు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు.

### కలెక్టర్‌ను కలిసిన కడ్తాల్ గ్రామస్తులు...

సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామానికి చెందిన వీడీసీ సభ్యులు, గ్రామస్తులు మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందించారు. తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు పేర్కొన్నారు.



జ్యోతిష్యం చెబుతూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

## జ్యోతిష్యం చెప్పి..

*నిర్మల్ పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట గల ఉద్యోగ, ఉపాధ్యాయుల నిరవదిక సమ్మె మంగళవారం నాటికి 15వ రోజుకు చేరుకుంది. ఈ నిరసనలో భాగంగా సమ్మక్క-సారలమ్మ జ్యోతిష్యం చెప్పి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. – నిర్మల్ అర్బన్, డిసెంబర్ 24*



సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య

## ధైర్యంగా ఫిర్యాదు చేయండి

ఎదులాపురం, డిసెంబర్ 24 : తప్పు చేసిన వాళ్లకు శిక్ష పడాలంటే ధైర్యంగా మనం ముందుకొచ్చి ఫిర్యాదు చేస్తేనే అది సాధ్యమవుతుందని సీనియర్ సివిల్ జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి భోనగిరి సౌజన్య అన్నారు. మంగళవారం మున్సిపల్ సమావేశ మందిరంలో మున్సిపల్ ఉద్యోగులకు డీఎల్ఎస్ఏ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సౌజన్య మాట్లాడుతూ.. మహిళల రక్షణ కోసం అనేక చట్టాలు ఉన్నాయని, వాటి గురించి తెలుసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ భయపడకుండా ధైర్యంగా ఫిర్యాదు ఐసీసీ(ఇంటర్నల్ కంప్లైంట్ కమిటి)కి ,(ఎల్‌సీసీ) కమిటీకి ఫిర్యాదు చేస్తే విచారణ చేపట్టి దోషులకు శిక్ష పడడంతోపాటు, ఉద్యోగం నుంచి తొలగించే అవకాశాలు ఉన్నాయని పేర్కొన్నారు. అనంతరం మహిళ సాధికారత జిల్లా కో-ఆర్డినేటర్ పవర్ యశోద మాట్లాడుతూ.. మహిళల కోసం ప్రత్యేకంగా భరోసా కేంద్రాలు, సఖి సెంటర్లు పని చేస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నగేశ్ పాల్గొన్నారు.

## మెరుగైన వైద్య సేవలు అందించాలి

**ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా**

నార్నూర్, డిసెంబర్ 24 : మారుమూల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా అన్నారు. గాదిగూడ మండలంలోని చిత్తగూడ గ్రామంలో ఐటీడీఏ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో స్పెషలిస్ట్ వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ఐటీడీఏ పీవో వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. వైద్య నిపుణులు ప్రజలకు అందించే వైద్య సేవలు అడిగి తెలుసుకున్నారు. వైద్య నిపుణులతో పరీక్ష చేసి.. అవసరమైన వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ యువరాజ్ మర్మాట్, డీఎంహెచ్‌వో రాథోడ్ నరేందర్, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్‌రాథోడ్, అడిషనల్ డీఎంహెచ్‌వో కుడ్మెత మనోహర్, ఐడీఏ అధ్యక్షుడు డాక్టర్ సమోయిద్దీన్, పీవీటీజీ ఏపీవో మెస్రం మనోహర్, వైద్య నిపుణులు విజయ్‌సారిథి, సాయినాథ్, మహిలక్ష్మి, నవీన్, సాయి, ఆనంద్, రాంకిషన్, గాదిగూడ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్, ఝరి వైద్యాధికారి సంజీవ్ పాల్గొన్నారు.



వైద్యం శిబిరంలో పాల్గొన్న ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా

## ముస్తాబైన చర్చీలు

**నేడే క్రిస్మస్**

ఎదులాపురం, డిసెంబర్ 24 : లోక రక్షకుడు ఏసు క్రీస్తు జన్మదినం సందర్భంగా ఆదిలాబాద్ పట్టణంలోని క్రైస్తవ ప్రార్థనా మందిరాలు ముస్తాబయ్యాయి. ఈనెల 25, 26 తేదీల్లో క్రిస్మస్ సంబరాలు జరగనుండగా అందుకోసం ఆయా చర్చిల్లో క్రైస్తవ మిషనరీలు భారీగా ఏర్పాట్లు చేశాయి. వివిధ ప్రాంతాల్లో ఉన్న క్రైస్తవ మందిరాలను విద్యుద్దీపాలతో అందంగా అలంకరించారు. పలు చర్చిల్లో ఏసు జనన వృత్తాంతాన్ని వివరిస్తూ బొమ్మల కొలువులను అందంగా తీర్చిదిద్దారు. క్రిస్మస్ ప్రార్థనల కోసం చర్చీల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఏసు ప్రభువును స్వాగతిస్తూ చర్చీలు, ఇళ్ల ముందు నక్షత్ర దీపాలను ఏర్పాటు చేశారు. చర్చీల ఆవరణలో రంగురంగుల విద్యుద్దీపాలతో క్రిస్మస్ ట్రీలను ఏర్పాటు చేయగా.. సిరీస్ లైట్ల వెలుగులో సాయం కాలం వేల చర్చీలు కొత్త అందాలను సంతరించుకుంటున్నాయి. పండగ రోజున ప్రార్థనల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. వినాయక్ చౌక్ లోని రోమన్ క్యాథలిక్ చర్చితోపాటు రవీంద్రనగర్ సీఎస్ఐ చర్చిల్లో జరిగే ప్రార్థనలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.




విద్యుద్దీపాల అలంకరణలో చర్చీలు

## రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబర్చాలి..

**నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్**

సోన్, డిసెంబర్ 24 : జిల్లా స్థాయి నుంచి రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడా పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను మెరుగైన స్థానంలో నిలపాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో పాల్గొనే విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా నుంచి 550 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడల్లో పాల్గొనబోతున్నట్లు కలెక్టర్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో జరిగే క్రీడల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లాను మెరుగైనా స్థానంలో నిలపాలని తెలిపారు. విద్యార్థులకు టీషర్ట్‌లు, టోపీలు కలెక్టర్ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, పీఈటీ సెక్రెటరీ భోజన్న, పీడీ భూమన్న పాల్గొన్నారు.